# హైదరాబాద్‌లో "భూకంపం"

**పలుప్రాంతాల్లో 2నుంచి 3 సెకన్లపాటు కంపించిన భూమి**

**ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల నుంచి జనం పరుగులు**





**హైదరాబాద్, డిసెంబరు 4,ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాల్లోని బుధవారం ఉదయం భూకంపం సంభవించింది. ఉదయం 7.25 గంటలకు కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థం కాక.. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటుగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల పరిధిలో ప్రకంపనలు వచ్చాయి. ఉన్నట్లుండి భూమి కంపించటంతో ఏం జరిగిందో అర్థం కాక భయాందోళనకు గురయ్యారు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న తమ వాళ్లకు ఏమైందోనన్న కంగారుతో ఊళ్ల నుంచి కాల్స్ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలోని మణికొండ, బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, అత్తాపూర్, నార్సింగి, రాజేంద్రనగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెంట్, ఎర్రగడ్డ, బోరబండ ఏరియా ల్లో భూకంపం ప్రభావం కనిపించింది. 20 ఏళ్ల తర్వాత హైదరాబాద్ నగరంలో భూకంపం సంభ వించినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.3 నమోదైంది. మూడు నుంచి ఐదు సెకన్లు భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది.

హైదరాబాద్ వార్త



# అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

**-నేడు మంత్రుల చేతుల మీదుగా పట్టాలు పంపిణీ**

**-జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి వెల్లడి**



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 4,ప్రభాతవార్త:** జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి తెలిపారు. ముందుగా జూబ్లీహిల్స్, ముషీరాబాద్ నియోజకవర్గంనకు సంబంధించిన లబ్ధిదారులకు గురువారం ఉదయం మంత్రులచే డబుల్ బెడ్ రూమ్ పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ విసి కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రోజు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ముషీరాబాద్ నియోజవర్గంలోని బాకారంకు చెందిన 37 మంది లబ్ధిదారులకు అలాగే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కమలానగర్‌కు చెందిన 44 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను జరుగుతుందని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ పట్టాలను ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ లో పంపిణీ చేయడం జరుగుతుందని దానికి సంబంధించిన ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులు గురువారంఉదయం 8.00 గంటలకు తమ ఆధార్ కార్డు,3 ఫోటోలతో లక్డికాపూల్, హైదరాబాద్ కలెక్టరేట్ కు చేరుకోవాలని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, కలెక్టరేట్ ఏవో సదానందం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజ నీర్ అనంతం, డిపిఆర్ఓ అబ్దుల్ కలీం, గృహ నిర్మాణ శాఖ డిఈలు, తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# శుభ్రతను మెరుగుపరిచేందుకు జిహెచ్ఎంసి కీలక చర్యలు

**-సర్కిల్‌కి 50 చొప్పున చెత్తరిక్షాలు, వీల్‌బారోల్, పుష్‌కార్ట్‌లు పంపిణీ**

**-జూబ్లీహిల్స్‌లో కార్మికులకు అందజేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



కార్మికులకు వీల్‌బారోల్‌లను అందజేస్తున్న మేయర్ గద్వాల్ విజయక్ష్మీ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 4,ప్రభాతవార్త:** పారిశుధ్య నిర్వహణలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నగరంలో శుభ్రతను మెరుగుపరిచే దిశగా పలు కీలక చర్యలు చేపట్టిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తెలిపారు. బుధవారం జూబ్లీహిల్స్ సర్కిల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పారిశుధ్య కార్మికులకు రిక్షాలు, వీల్ బారోల్ / పుష్ కార్ట్ (రిక్షా)లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరిచేందుకు 1500 చెత్త రిక్షాలు (ట్రై సైకిళ్లు) కొనుగోలు చేసి ప్రతి సర్కిల్ కు 50 చొప్పున అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా 1500 వీల్ బారోల్/ పుష్ కార్ట్ లు కొనుగోలు చేసి ప్రతి సర్కిల్ కు 50 వీల్ బారోల్/ పుష్ కార్ట్‌లను అందుబాటులో ఉంచామని తెలిపారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ వద్ద చెత్తను పారవేయకుండా ఊడ్చిన చెత్తను నిల్వ చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వడానికి ఇట్టి త్రిచక్ర చెత్త రిక్షాలు మరియు వీల్ బారోల్ లు పారిశుధ్య కార్మికుల గ్రూపులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వీధుల్లో ఊడ్చే ప్రదేశాల్లో చెత్త సేకరణకు ఈ రిక్షాలు ఉపయోగించడం జరుగుతుందని, జి.వి.పి ల తొలగింపులో ఈ రిక్షాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణ ను మరింత మెరుగుపరుస్తూ నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో సహాయపడతాయని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ సర్కిల్ మెడికల్ ఆఫీసర్ భార్గవ్ నారాయణ, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులను వేధిస్తున్న డిసిని సస్పెండ్ చేయాలి



సర్కిల్ ఉద్యోగులు ధర్నా

**ఎల్‌బినగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఉద్యోగులను వేధిస్తూ నియంతల వ్యవహరిస్తున్న ఎల్బీనగర్ ఉప కమిషనర్ ఇస్లావత్ సేవానాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలనీ సర్కిల్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డీసీ టార్చర్ వల్ల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టాక్స్ఇన్స్పెక్టర్ ప్రాణాలకు ఏమైనా జరిగితే డీసీ భాద్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ సర్కిల్ 4 ఉద్యోగులు బుధవారం ధర్నా నిర్వహించి ఆందోళనకు దిగారు. అన్ని విభాగాల ఉద్యోగుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు హేయమైన చర్య అన్నారు. ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఉద్యోగులు ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 6 గంటలకు ఫీల్డ్ మీద ఉండగా టీ తాగే సమయంలో ఫోటోలు తీసి సరిగ్గా విధులు నిర్వహించడం లేదని హాజరు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. డిసి మానసికంగా ఒత్తిడి చేయడం వల్లనే టాక్స్ఇన్స్పెక్టర్ శ్రీనివాసరాజు బైక్ పైనుంచి కిందపడి తీవ్ర గాయాలపాలై చావు బతుకుల్లో ఆసుపత్రిలో వెంటిలెటర్‌పై చికిత్స పొందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మజ్దూర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీధర్, శంకర్, అశ్రాఫ్, యాదగిరి, శ్రీనివాస్, శివకుమార్, కిషోర్, సత్యనారాయణ, నర్సింగ్‌రావ్, ఆనంద్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా పన్నులు వసూలు చేసే విషయమై ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తున్నామని, ఉద్యోగులు ఎవరిని ఇబ్బంది పెట్టే అవసరం తనకు లేదని ఉప కమిషనర్ ఇస్లావత్ సేవానాయక్ వివరణ ఇచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌రాజు కుటుంబసభ్యులను కూడా పరామర్శించామని తెలిపారు.

# కౌలురైతులను ప్రభుత్వం గుర్తించాలి

**-ప్రొఫెసర్ హరగోపాల్**



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

**ధర్నాచౌక్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** తెలంగాణలో కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించాలని, రైతు సంక్షేమ పథకాలన్నింటినీ కౌలు రైతులకు అందించాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కౌలు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి హరగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ కే.శ్రీనివాస్, సామాజజిక కార్యకర్త రుక్మిణీరావ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఎస్.కే.ఎం.కన్వీనర్లు పశ్యపద్మ, విస్సా కిరణ్, కొండల్, వి.ప్రభాకర్, ఆర్.వెంకటరాములు, కౌలు సంఘాల నాయకులు మాదినేని రమేష్, సూర్యనారాయణ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 22లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారందరికీ 2011 చట్టం ప్రకారం లోన్ ఎలిజబుల్ కార్డులు ఇచ్చి, అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఆత్మహత్యలలో 70శాతం కౌలు రైతులవే ఉంటున్నాయని, రైతు ఆత్మహత్యలను నివారించాలంటే కౌలు రైతులను ఆదుకోవటమే మార్గమని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కూడ కౌలు రైతులను విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని, ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకోకపోతే మళ్లీ రైతాంగ ఉద్యమాలు తీవ్రరూపం దాలుస్తాయని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం నాయకకులు అరి బండి ప్రసాదరావు, పి.జంగారెడ్డి, మూడ్ శోభన్, బొంతు రాంబాబు, డి.బాల్‌రెడ్డి, రాజారావు, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రాజా, రాణిల వసూళ్ళకు ఫుల్ స్టాప్ లేదా?

**-మూసాపేట సర్కిల్ 23లో అక్రమ నిర్మాణాల జోరు -కమిషనర్ ఆదేశాల్ని పట్టించుకోని ఏసిపి, టిపిఎస్**





ఏసీపీ, టీపీఎస్‌ల కనుసన్నల్లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు ఇవే..

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబరు 4, ప్రభాతవార్త** భవన నిర్మాణ నిబంధనలను మరింత కచ్చితంగా అమలు చేయాలని ఓ వైపు జిహెచ్ఎంసి కమిషనర్ మరో వైపు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆదేశాలు ఇస్తుంటే అందుకు విరుద్ధంగా మూసాపేట్ సర్కిల్ 23 టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)తోపాటు టీపీఎస్ పట్టించుకోవడంలేదు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్వయంగా కమిషనర్ ఆదేశాలు ఇస్తున్నా గత నెలలో పదవీ బాధ్యతలు చేపట్టిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)తో పాటు రెండు నెలల క్రితం పదవీ బాధ్యతలు చేపట్టిన ఓ టీపీఎస్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ మహిళా అధికారి అయితే నేరుగా బిల్డర్లతో పాటు లైసెన్స్ ప్లానర్లు, బ్రోకర్లతో బేర, సారాలకు దిగి పెద్ద మొత్తంలో వసూళ్ళు చేస్తూ నాకింత, నీకింత అనే రీతిలో ఏసీపీ కార్యాలయంలో కీలక అధికారితోపాటు ఉన్నతాధికారులకు ముడుపుల్ని ముట్టచెబుతూ కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీనగర్, మూసాపేట్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు ఆమె అండగా నిలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ భగతుసింగ్ నగర్‌లో ప్లాట్ నెంబరు 1019లో జీ ప్లస్ టూ వరకు అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తుల్ని నిర్మిస్తున్నా పట్టించుకోవడంలేదు. ఈ అక్రమ భవనంపై ప్రజావాణిలో జోనల్ కమీషనర్‌కి 8 సార్లు స్థానికులు ఫిర్యాదలు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అదే విధంగా కెపిహెచ్‌బి కాలనీ 7వ ఫేజ్‌లో 67, 68 ప్లాట్లలో అక్రమ నిర్మాణంపై అనేక మార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమార్జనలో కొత్త రికార్డులు సృష్టిస్తోన్న మూసాపేట సర్కిల్ 23 టౌన్‌ప్లానింగ్ విభాగంపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), విజిలెన్స్ విభాగాల నిఘా అంతంత మాత్రంగా ఉండడంతో అవినీతి ఏ మాత్రం తగ్గకపోగా రోజు రోజుకు తారాస్థాయికి చేరుకుంటుంది. గ్రేటర్ ఆదాయాన్ని కొల్లకొట్టడమే లక్ష్యంగా పెట్టుకున్న ఏసీపీ కార్యాలయంలో ఓ ఉన్నతాధికారితోపాటు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టీపీఎస్ తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నా జిహెచ్ఎంసి కమిషనర్ తో పాటు కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. భవన నిర్మాణాలపై నిత్య పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత అధికారులు కొందరు మామూళ్ళ మత్తులో మునిగితేలుతున్నారు. కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీనగర్, మూసాపేట్ పరిసర ప్రాంతాల్లో గజం రూ. లక్షకు పైగానే ఉంది. ఈ నేపథ్యంలో బహుళ అంతస్తుల భవనాలలో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాల వారు ఆసక్తి చూపుతున్నారు.

ఈ నేపథ్యంలో బహుళ అంతస్తుల భవనాలు అనేక ప్రాంతాల్లో పుట్టగొడు గుల్లా పుట్టుకొస్తున్నాయి. నగరానికి ధీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళంతస్తుల భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. ఇళ్ళ నిర్మాణంలో నిబంధనల్ని పాటించడం లేదని సామాన్య మధ్య తరగతి ప్రజల్ని ముప్పు తిప్పలు పెట్టే అధికారులు నిబంధనలు పాటించని అనేక మంది బిల్డర్ల బహుళంతస్తుల భవనాల్ని అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా పట్టించుకున్న పాపాన పోవడంలేదు.

**రాజా, రాణిల మామూళ్ళ రేట్లు ఇలా.. వీళ్ళకు కోట్లు, జిహెచ్ఎంసికి తూట్లు..**

సర్కిల్ 23 అసిస్టెంట్‌సిటీ ప్లానరు (ఏసీపీ) కార్యాలయంలో కీలక బాద్యతలు నిర్వహిస్తోన్న ఓ అధికారితోపాటు ఓ మహిళా అధికారి చిన్న స్థాయి బహుళ అంతస్తుల భవనం వద్ద రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు తక్కువ కాకుండా మామూళ్ళు వసూలు చేయిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక పెద్ద పెద్ద భవనాలకు (కమర్షియల్) అయితే రూ. 5 లక్షల నుంచి 20 లక్షల వరకు లంచాలు తీసుకుంటున్నారన్న ప్రచారం కూడా సాగుతోంది. అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా మొక్కుబడిగా నోటీసులు జారీచేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పైగా న్యాయస్థానాలను ఆశ్రయించి ఏ విధమైన చర్యలు చేపట్టకుండా స్టే తెచ్చుకుంటే బావుంటుందనే ఉచిత సలహాలను సైతం నోటీసులు ఇచ్చిన భవన యజమానులకు కొ oదరు అధికారులు సలహాలు ఇస్తున్నారన్న ప్రచారం కూడా బాహాటంగానే వినిపిస్తోంది. రెసిడెన్సియల్ పేరిట అనుమతులు తీసుకుంటున్న అనేక మంది బిల్డర్లు, వాణిజ్య అవసరాల నిమిత్తం మడిగెలు, దుకాణాల్ని నిర్మిస్తున్నారు. అనుమతుల కోసం ముందుగా ప్లాన్‌లో అన్నీ సక్రమంగానే ఉన్నట్లు పేర్కొని భవన నిర్మాణ అనుమతులు పొంది ఆ తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి స్థలాలకు రెక్కలు రావడంతో పాటు స్థానికంగా వాణిజ్య అవసరాలు పెరుగడంతో అనేక మంది బిల్డర్లు అడ్డదారిలో సెల్లార్లను తవ్వి పార్కింగ్ స్థలాల్లో పెద్ద పెద్ద భవనాల్ని నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. నిబంధనల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుంటున్న బిల్డర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అక్రమంగా నిర్మిస్తున్న కమర్షియల్ భవనాల్ని సంబంధిత అధికారులు అడ్డుకోకపోవడంతో ఒకరిని చూసి మరొకరు పోటీపడి వాణిజ్య అవసరాలకు నిర్మించి కోట్లాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు పొందిన దానికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుండడంతో కోట్లాది రూపాయల జిహెచ్ఎంసి ఆదాయానికి గండిపడుతుంది. ఇటీవలి కాలంలో అనేక ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. సర్వధికారాలు ఈ అధికారులకు ఉన్నప్పటికీ కూకట్‌పల్లి టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీ, టీపీఎస్‌లు ఇటీవలి కాలంలో ఒక్క అక్రమ నిర్మాణంపై కూడా చర్యలు తీసుకున్న దాఖాలాలు లేవు.

సర్కిల్ 23 ఏసీపీ కార్యా లయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ ఉన్నతాధికారితోపాటు టీపీఎస్‌లు బిల్డర్ల అక్రమ నిర్మాణాల చిట్టా తెప్పించుకుని నీకింత నాకింత అన్నట్లుగా రూ.కోట్లలో అందిన మేర దండుకుం టున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం సీజ్



సీజ్ చేసిన అక్రమ నిర్మాణం

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 4, ప్రభాతవార్త** వడ్డించేటోడు మనోడైతే.. ఏ మూలన కూసుంటే ఏముందన్న చందంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణదారులకు పాటగా మారింది. గతంలో అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం అప్పటి అధికారులు ఇక్కడి నుండి మరో చోటకు బదలీపై వెళ్లారు. ఆ స్థానంలో కొత్త అధికారులు వచ్చారు. ఇంకేముంది అక్రమ నిర్మాణాలపై ఒక్కొక్కటిగా లెక్కలేసుకుంటూ ముందుకెళ్తున్నారు. స్థానికుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇక కొత్త అధికారులకు తలనొప్పులుగా మారడంతో దూకుడు పెంచారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. దీనిలో భాగంగా సుచిత్ర చౌరస్తా నుండి కుత్బుల్లాపూర్ వైపుకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా హనుమాన్ దేవాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన అక్రమ నిర్మానాన్ని సీజ్ చేశారు. నిబంధనలు ఒకటైతే.. నిర్మాణం మరోలా చేపట్టడంతో స్థానికుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు.

# గంజాయి స్వాధీనం..

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఫతేనగర్ వడ్డెర బస్తీలో మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగంవారు దాడులు చేసి 1.500 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి మరో ఇద్దరు నిందితులుపై కేసులు నమోదు చేసినట్లు మేడ్చల్ మద్యనిషేద, ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ తెలిపారు. ఫతేనగర్ పార్తీవాడకు చెందిన ఇస్లీ కవిత (37) తన అనుచరుడైన ముస్తఫా హుస్సేన్ (34)తో కలిసి ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన గాయత్రి వద్ద 11.000 రూపాయలకు గంజాయిని కొనుగోలు చేసి, వడ్డేర బస్తీలో కిరాయికి గదిని తీసుకుని గంజాయిని నిల్వ చేసి, చిన్న చిన్న పాకెట్లుగా తయారు చేసి ముస్తఫా హుస్సేన్, తన సోదరి పార్థివాడకు చెందిన వరలక్ష్మీ అలియాస్ వరమ్మ ద్వారా అధిక ధరలకు గంజాయిని అమ్ముతున్నాడనే సమాచారంతో బుధవారం మధ్యాహ్నం దాడులు చేసినట్లు, ఇస్లీ కవిత, ముస్తఫా హుస్సేన్‌ను అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు గాయత్రి, వరలక్ష్మీలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద గంజాయితో పాటు 17,000 నగదు, రెండు చరవాణీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మాధవయ్య ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పవన్ కుమార్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశ్వరరావు, సత్తార్,సంజయ్,జ్యోతి పాల్గొన్నారు.

# మజ్లిస్ ఎమ్మెల్యేలతో కమిషనర్ సి.వి.ఆనంద్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్

**చార్మినార్,డిసెంబరు 4 ప్రభాతవార్త :** ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా నగర పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్ బుధవారం మలక్‌పేట్ నుంచి గోల్కొండ,లంగర్ హౌస్ వరకు ట్రాఫిక్ సమస్య,ఫుట్ పాత్‌ల ఆక్రమణ విషయమై హైదరాబాద్ పాతబస్తీ పురానీహవేలీలోని డిసిపి కార్యాలయంలో ఎంఐఎం శాసన సభ్యులు, కార్పొరేటర్లతో చర్చించారు.ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ నగరంలో రోజు,రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగి పోతున్నదని,మూడు పోలీస్ కమిషనరేట్ పరిధులలో యానభై ఎనిమిది లక్షల వాహనాలు నడుస్తున్నాయని,ప్రతీ రోజు 1500 కొత్త వాహనాలు యాడ్ అవుతున్నాయని తెలిపారు.ఫుట్‌ఫాత్‌లు అక్రమణకు గురివుతున్నాయని,రోడ్డు మార్గం తగ్గి పోతుండటంతో రద్దీ పెరుగుతున్నదని,దాన్ని నివారించవలసిన అవసరం ఉందని ఆయన తెలియజేశారు.ఈ విషయంలో ఎమ్మెల్యేల సహాకారం ఎంతో అవసరముందని,అందు కోసం ఎమ్మెల్యేలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అందుకు ఎంఐఎం శాసన సభ్యులు తమ సహకారాన్ని అందిస్తా మని తెలియజశారని సి.వి.ఆనంద్ తెలిపారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఎంఐఎం శాసన సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ,అహ్మాద్ బిన్ బలాల,మహ్మాద్ మాజిద్ హుస్సేన్, మీర్ జుల్ఫికర్ అలీ,కౌసర్ మొహియుద్దీన్,మహ్మాద్ ముబీన్,జాఫర్‌హుస్సేన్,నగర అదనపు ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ పి,విశ్వ ప్రసాద్,ట్రాఫిక్ డిసిపి మూడు ఆర్,వెంకటేశ్వర్లు,దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా,సౌత్ ఈస్ట్ డిసిపి పాటిల్ కాంతిలాల్ సుభాష్, జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నతో పాటు పలువురు ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక నేతలకు స్వాగతం పలికిన ఎఐటియుసి



అంతర్జాతీయ కార్మిక నేతలకు ఆహ్వానం పలుకుతున్న ఎఐటియుసి నేతలు

**సైఫాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో 'అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్ర-నేటి పరిస్థితులు' అనే అంశంపై జరిగే సదస్సులో ముఖ్యఅతిథులుగా పాల్గొనేందుకు రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు జార్జియోస్ మావ్రికోస్, డిప్యూటి జనరల్ సెక్రటరీ స్వదేశ్ దేవరాయ్‌లకు ఎఐటియుసి రాష్ట్ర సమితి ఆహ్వానం పలికింది. బుధవారం ఎయిర్‌పోర్టులో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసఫ్, ఎస్.బాల్ రాజ్, ఉపాధ్యక్షురాలు ప్రేమ్‌పావని, జాతీయ నాయకురాలు బి.వి.విజయలక్ష్మి వారికి స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువలతో సత్కరించారు.

### దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



బోయిన్‌పల్లి చిన్నతోకట్ట గడి మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ 1వ వార్డు చిన్నతోకట్టలోని శ్రీ గడి మైసమ్మ రేణుక ఎల్లమ్మ ఆలయం పునప్రతిష్ట మహోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కన్నుల పండువగా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నేతలు సామల రాఘవరెడ్డి, ముప్పిడి మధుకర్, ఆలయ కమిటీ సభ్యులు కొండల్ యాదవ్, ముఖేశ్ యాదవ్, జయకుమార్, జాజుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

### బంగ్లాదేశ్ హిందువులకు రక్షణ కల్పించాలి : కొంతం దీపిక



ట్యాంక్ బండ్‌కు తరలివెళ్లిన మోండా కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**అడ్డగుట్ట, డిసెంబరు 4 ప్రభాతవార్త:** బంగ్లాదేశ్ హిందువుల రక్షణకై హిందు ఐక్యవేదిక, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్కు వద్ద ఆర్.ఎస్.ఎస్, విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దల్ సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక ఊరేగింపుగా తరలివెళ్లి సంఘీ భావం తెలిపారు.

### రైల్వేలో ప్రశాంతంగా ప్రారంభమైన గుర్తింపు ఎన్నికలు

**కంటోన్మెంట్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు ఎన్నికలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎస్.సి.ఆర్. ఎంప్లాయిస్ సంఘ్, రేల్ మజ్దూర్ యూనియన్, ఇండియన్ రైల్ మజ్దూర్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ వంటి ఐదు యూనియన్లు పోటీలో ఉన్నాయి. ఈ ఎన్నికలు ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగుతాయి. ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 12వ తేదీన జరుగుతాయని డిప్యూటీ ఛీఫ్ పర్సనల్ ఆఫీసర్ బాలమురళీ తెలిపారు. సికింద్రాబాద్ రైల్ నిలయం, సంచాలన్ భవన్, హైదరాబాద్ భవన్, లేఖ భవన్‌ల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందో బస్తును ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సిపి. ఓ.ఐ.ఆర్.తెలిపారు.

### అవినీతి, అక్రమాలు అరికట్టడం యువత ద్వారానే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

**సైఫాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ప్రస్తుతం సమాజంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, వీటిని అరికట్టడానికి మార్పు అవసరమని, మార్పు అనేది నేటి యువతరం ద్వారానే సాధ్యమవుతుందని దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ యువశక్తి పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది పి.రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. రాబోయే స్థానిక సంస్థలు, జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చి గెలిపించుకుంటామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు రాజమల్లయ్య, నరేందర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు కుటుంబ పాలనను ప్రోత్సహిస్తున్నాయని, అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి, లంచగొండి తనం పెరిగిపోతున్నాయని ఆరోపించారు. వీటిని నామరూపాలు లేకుండా చేయడం యువత ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. తమ పార్టీ ద్వారా యువత రాజ్యాధికారం చేపట్టి వీటిని రూపుమాపాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తుందని, వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని, ఉచితంగా విద్యా, వైద్యం అందిస్తామని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని, స్థానికులకే ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

### బైకుల దొంగ అరెస్టు..వాహనాల స్వాధీనం

**ఎల్‌బినగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** బైకులు కార్లు దింగతనం చేసే ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, డిటేక్టివ్ ఇన్స్పెక్టర్ యస్.గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గోల్కొండ కోట పక్కన ఉండే సయ్యద్ సాహిల్ (24) డ్రైవర్‌గా పనిచేస్తూ సులువుగా డబ్బులు సంపాదించడం కోసం దింగతనాలకు పాల్పడుతు న్నాడు. పార్కింగ్ చేసిన వాహనాల లక్ష్యంగా చేసుకొని వాటిని దింగిలించి విక్రయిస్తున్నాడు. బుధవారం అతన్ని పట్టుకొని ఒక యమహా బైక్ నెం. టీఎస్ 07 జేహెచ్ 0502, ఒక స్ప్లెండర్ బైక్ ఏపీ 29 బిఎన్ 4575, ఒక రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ టీఎస్ 15 ఈవై 4214, ఒక టాటా నెక్సన్ కారు టీఎస్ 08 జీఎస్ 1502 మూడు ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సాహిల్ గతంలో కూడా హైద రాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని 10 పోలీస్‌స్టేషన్‌లలో వివిధ నేరాల కింద పోలీసులకు పట్టుబడి జైలుకి వెళ్ళాడు. పలు నేరాల కింద పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చిన సాహెల్ అతని బుద్ధి మాత్రం మార్చుకో లేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**-డిప్యూటీ సీఎంకు ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు సంజీవ రెడ్డి వినతి**



డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్కతో సంజీవరెడ్డి, మొగుళ్ల రాజిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 4,ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు జి. సంజీవ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్, సీవరేజ్ కంగారు యూనియన్ అధ్యక్షులు, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్ర శేఖర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి సి. హెచ్. సురేష్ బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి. భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్, శ్రీ కె. రామ రాజు తదితరులు హైదరాబాద్ లో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ను కలసి వినతి పత్రం అందజేశారు. వేతనాలు పెంచడం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్దీకరణ, హెల్త్ కార్డు లు, ప్రమోషన్ చానల్ లేనటువంటి (క్యూ.ఏ.టీ) జె.టీ. ఓ. అప్గ్రేడేషన్ ఏ. టీ. ఓ ప్రమోషన్లు వంటి ప్రధాన సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఐ.ఎన్.టి.యు.సి అనేక పోరాటాల ఫలితంగా గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసిందని గుర్తు చేసారు. త్వరలో జరగబోయే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ హైదరాబాద్ వాటర్ వర్క్స్, సీవరేజ్ కంగారు యూనియన్ పోటీ చేస్తుందని, ఐ.ఎన్.టి.యు.సి విజయ బావుటా ఎగరవేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క స్పందిస్తూ జలమండలి కార్మికుల సమస్యలను వెంటనే సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానన్నారు.

## గుల్‌మోహర్‌పార్కు అసోసియేషన్‌కు ఎమ్మెల్యే గాంధీ అభినందనలు

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 4 ప్రభాతవార్త**

జాతీయ స్థాయిలో గుల్‌మోహర్‌పార్క్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్ది ఉత్తమ పార్కుగా అవార్డు పొందేందుకు కృషిచేసిన కాలనీ అసోసియేషన్ సభ్యుల కృషి ప్రశంసనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అభినందించారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని గుల్‌మోహర్‌పార్క్ కాలనీలోని పార్కు ఇటీవలే జాతీయస్థాయిలో ఉత్తమ పార్కుగా ఎంపికవడంతో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ ఖాసీంను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ..నిరంతరం కష్టించి కాలనీ అభ్యున్నతికోసం పరిశ్రమించే సభ్యుల కృషికి తగిన ఫలితంగా నేడు గుల్‌మోహర్‌పార్క్ జాతీయ స్థాయిలో ఉత్తమ పార్కుగా ఎంపికవడం తమకే కాదు, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. కాలనీలోపెండింగ్‌లో ఉన్న కొన్ని సమస్యలు తమ దృష్టిలో ఉన్నాయని, సీసీరోడ్డు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్



జాతీయ ఉత్తమపార్కు అవార్డు పొందిన గుల్‌మోహర్‌పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు ఖాసీంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

పనులు విషయంలో త్వరితగతిన పనులు పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుల్‌మోహర్‌పార్క్ పార్కు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ ఖాసీం,ప్రధాన కార్యదర్శి ఎస్. ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు పి.ప్రభాకరచారి, జాయింట్ శెక్రటరీ కే.వెంకటేశ్వర్లు, సభ్యులు విల్సన్, సత్యనారాయణ,కిరణ్,వెంకట్‌రెడ్డి,నర్సయ్య,కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## అమర గాయకుడు ఘంటసాల



**చిక్కడపల్లి డిసెంబరు 4 (ప్రభాతవార్త)**

జోశ్యుల మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల 102 జయంతి సందర్భంగా రాగాల సరాగాల పాసాల విలాసాల పేరుతో తెలుగు హిందీ సినీ సంగీత విభాగరి కార్యక్రమం బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలో నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు ప్రముఖ గాయని గరిమెళ్ళ సీత ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధన మూర్తి హాజరై అద్భుతంగా గానం చేసిన గాయనీ గాయకులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు వల్లకొండ వెంకట్రావు, రమా శంకర్, విజయలక్ష్మి, గాయనీపి అన్నపూర్ణ, సుధారాణి, రామ్ ద్రోణం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయలీ గాయకులు సరస్వతి రాధిక అనురాధ గోవింద లక్ష్మి అరుణ వెంకటరమణ లక్ష్మీరత్నం, వారణాసి లలిత, లక్ష్మీ గోపాల్, ఝాన్సీ శోభా, సాయి సరయు, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**-ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవి**



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసిన వాటర్ బోర్డు యూనియన్ నాయకులు

**చిక్కడపల్లి డిసెంబర్ 4 (ప్రభాతవార్త)..**

వాటర్ బోర్డులో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల పరిష్కరించాలనికోరుతూ కాంట్రాక్ట్, స్పోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ ల నేతృత్వంలో యూనియన్ కార్మికులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జీవో 21 ద్వారా సమస్యలను సాధించుకున్నామని, సాదించుకోవడం కోవడం జరిగిందని, తద్వారా కొంత మేరకు వేతనాలు పెంచుకోగలిగామని అన్నారు. వాటర్ బోర్డు అధికారుల తప్పిదం వల్ల జీవి. 60 /20 21 అమలు ప్రక్రియ సందర్భంగా క్యాటగిరి2లో చేర్చాల్సిన కార్మికులను క్యాటగిరి1 లో చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రతినెలా కార్మికులకు 4000 రూపాయలు తక్కువ వేతనం వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ కవితను వివరించారు. ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, కుమార్, జగన్, రమేశ్, వీరాస్వామి,రాములు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :**

ఉప్పల్‌లో ఆర్టీసీ బస్సులలో చోరీలకు పాల్పడుతున్న ఒక మహిళతోపాటు, మరో వ్యక్తిని ఆర్టీసీ అధికారులు పట్టుకుని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ కంట్రోలర్ బిక్షపతి, కానిస్టేబుల్ కావ్య, చెంగిచెర్ల డిపో కండక్టర్ రాములు విధులు నిర్వహిస్తుండగా ఒక మహిళ సెల్‌ఫోన్ దొంగతనం చేస్తూ కనిపించింది. దీంతో వారు ఆ మహిళను పట్టుకునేందుకు ప్రయత్నించగా రాళ్లతో దాడి చేస్తూ పరారీ అయ్యేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. దీంతో కానిస్టేబుల్ కావ్య వెంబడించి మహిళను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సదరు మహిళ గతంలో గొలుసు దొంగతనం కేసులో ఉందని, ఆమెపై 17 కేసులు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఉప్పల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## ఘంటసాల జయంతి వేడుకలు



పురస్కాలను ప్రధాన చేస్తున్న వంశీ రామరాజు

**చిక్కడపల్లి డిసెంబరు 4 (ప్రభాతవార్త).**

.సెవెన్ హిల్స్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వంశీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షులు వంశీ రామరాజు ముఖ్య అతిథిగా,యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ సభాధ్యక్షులుగా త్యాగరాయ గానసభ ప్రధాన మందిరంలో, ఘంటసాల జయంతి సందర్భంగా లబ్ధప్రతిష్టులైన వారిని ఘంటసాల పురస్కారాలతో సత్కరించారు. ముఖ్యఅతిథి మాట్లాడుతూ దివ్యంగ గాయనీ మణులు పద్మప్రియ, రుక్మిణీతో పాటు సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులను , జూనియర్ శోభన్ బాబులా అలరించిన కళాకారుడిని, మయసభ దుర్యోధనుడిగా రంజింపజేసిన కళాకారుడిని సత్కరించడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరూ కళల్ని కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా జీ వీ ఆర్ కార్యదర్శి వీ వీ రాఘవరెడ్డి , సంఘసేవకులు వల్లకొండ వెంకట్రావు, రామలింగేశ్వర రావు, కటకం భాస్కర్ గుప్తా,దంపనబోయిన శ్రీనివాస్, పంపన సత్యనారాయణ, మోటివేషనల్ స్పీకర్ రజినీరమా,జ్యోతిష్యులు హనుమంత రాయశర్మ పాల్గొనగా , సెవెన్ హిల్స్ అధ్యక్షులు వేంద్ర ఏడుకొండల రావు వందన సమర్పణ చేసారు.

## నార్సింగిలో రోడ్డుపాలైన లక్షల లీటర్ల మంచినీరు

**- పట్టించుకోని జల మండలి అధికారులు, సిబ్బంది**

**నార్సింగి, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో విలువైన లక్షలాది లీటర్ల మంచినీరు రోడ్డుపాలైంది. జలమండలి అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోడ్డంతా ఏరులై పారింది. నాలుగు గంటల పాటు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిండి మంచినీరు వృధాగా పారిందని స్థానికులు పేర్కొన్నారు. ఇంకా వేసవి రాలేదని, అప్పుడే వారానికి ఒకరోజు నీటిని వదులుతున్న అధికారులు ఇలా వృధాగా పోతున్నా పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యంకు నిదర్శనమని నార్సింగి మున్సిపల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా నుంచి ముక్కుపిండి నల్లా బిల్లులు వసూలు చేసే జల మండలి అధికారులు సవ్యంగా నీరు ఇవ్వడం లేదని వాపోతున్నారు. గత నాలుగు రోజుల క్రితం మణికొండ మున్సిపల్‌లోని అల్కాపూర్‌లో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయి విలువైన నీరు వృధాగా పోయిందని స్థానికులు వివరించారు. జల మండలి అధికారులు జవాబాదారిగా వ్యవహరించడం లేదని, ఫలితంగానే తరుచూ విలువైన మంచినీరు రోడ్లపై ఏరులై పారుతుందని విద్యావంతులు మండి పడుతు న్నారు. వెంటనే జల మండలి ఉన్నతాధికారులు స్పందించి మంచినీరు వృదా చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ఎస్.కె.మిశ్రోకు చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారం : డా. కె.వి.రమణాచారి

**నాంపల్లి, డిసెంబరు 4 ప్రభాతవార్త :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 1999 నుండి చాట్ల శ్రీరాములు జయంతి వేడుకలను నిర్విరామంగా నిర్వహిస్తూ నాటకరంగ విశిష్టులకు ప్రదానంచేసే ప్రతిభా పురస్కారం-2024ను ప్రఖ్యాత రంగస్థల, టీవి, చలనచిత్ర నటుడు, దర్శకుడు, రచయిత 80ఏళ్ల సునీల్‌కుమార్ మిశ్రోకు ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, రసరంజని అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి మీడియాకు తెలిపారు. మిశ్రో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఉత్తర తెలంగాణ తదితర తెలుగు ప్రాంతాల్లో విశ్వప్రభావితమైన వ్యక్తి అని గుర్తుచేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కె.వి. రమణాచారి సంస్థ ప్రధాన కార్యదర్శి కె.నటరాజ్, ఉపాధ్యక్షుడు డి.రామకోటేశ్వరరావు, సహకార్యదర్శి టి.అరుణ్ కుమార్, సభ్యుడు నారాయణస్వామి తదితరులతో కలిసి కార్యక్రమ ఆహ్వానపత్రికను ఆవిష్కరించి నప్రసంగించారు. 5న గురువారం రాత్రి 6.30గంటల నుండి నాంపలిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో కృష్ణయ్య సభాధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు.

## సహకారానికి దివ్యాంగుల డిసేబుల్డ్ అవేర్‌నెస్ వాక్ : డా. కె.వి.రమణాచారి



దివ్యాంగుల అవగాహన నడక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె.వి.రమణాచారి, కొల్లినాగేశ్వరరావు, సుబ్బారావు తదితర అతిథులు

**నాంపల్లి, డిసెంబరు 4 ప్రభాతవార్త :**

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 6 శుక్రవారం ఉదయం దివ్యాంగుల అవగాహన నడక (డిసేబుల్డ్ అవేర్‌నెస్ వాక్) కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను రెడ్‌హిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో డా. కె.వి.రమణాచారి వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర రావు, కె.సుబ్బారావు, పి.శ్రీనివాస్, కార్తీక్, శ్రీనివాస్‌లతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ అవగాహన నడక నెక్లెస్‌రోడ్డు ఇందిరాగాంధీ విగ్రహం నుండి పీపుల్స్‌ప్లాజా వరకు వికలాంగుల హక్కుల వేదిక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దివ్యాంగులపట్ల జాలి, దయ, సానుభూతి కాకుండా తాము అందరిలా మనుషులమని గుర్తించి తగిన సహకారం సమర్థత చేయూత అందించాలని కోరుతూ 12వ సారి ఏర్పరచిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ వల్ల దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తోడ్పతున్న సంస్థలను అభినందిస్తూ అవగాహన నడక ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దివ్యాంగులపట్ల ఎంతో అభిమానంతో ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ దివ్యాంగుల అవగాహన నడక విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ మనసున్న మనుష్యుల్లారా మాతో కలిసి కాసేపు నడవండి, ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల చట్టాలను తు.చ తప్పకుండా అమలుచేయాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అన్ని విషయాల్లో పూర్తి సహకారం అందించాలని కోరుతూ రాష్ట్రంలో 12వసారి ఏర్పాటు చేసిన డిసేబుల్డ్ అవేర్‌నెస్ వాక్‌లో కలిసి అడుగులువేసి వికలాంగుల జీవితానికి చేయూతనిచ్చేందుకు కలసిరండని పిలుపునిచ్చారు.

# ప్రజా పరిపాలననా...ఫ్యాక్షనిస్టుల పాలననా..?

**-హామీలు ప్రశ్నిస్తే మాపై అక్రమ కేసులా**
**-సిఎం సోదరులపై కేసు నమోదు చేశారా**
**-కేసులకు బెదరం..ఉద్యమంలో అనేక చూశాం**
**-ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, క్రిష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మాధవరం క్రిష్ణారావు, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**దుండిగల్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** ఉద్యమంలో అనేక చూశాం..కేసులకు ఎనాడు భయపడింది లేదు..కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతూ అక్రమ కేసులు పెట్టిన ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తాం..ప్రజాగొంతులకై ప్రభుత్వాన్ని నిలదీస్తామని భారాస ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావుపై కేసులు నమోదు చేయడం ఖండిస్తూ బుధవారం గండిమైసమ్మలోని భారాస మేడ్చల్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యేలు వివేకానంద్, క్రిష్ణారావు, మల్కాజిగిరి పార్లమెంటు ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపరిపాలన నడుస్తుందా..ఫ్యాక్షనిస్టుల పాలన నడుస్తుందా అని ప్రశ్నించారు. చక్రధర్‌గౌడ్ అనే ఒక చీటర్ ఫిర్యాదు చేస్తే ఎటువంటి ఆధారాలు లేకుండా మాజీమంత్రి హరీష్‌రావుపై కేసులు నమోదు చేయడం సరికాదు. ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు అవతలి వ్యక్తి ఎవరు..ఆయన విశ్వసనీయత ఎమిటని పోలీసులు ఆలోచించాలి. కోర్టు ఆదేశాలు ఇవ్వకుండానే, ముఖ్యమంత్రి ఆదేశాలతోనే మాజీమంత్రిపై కేసులు నమోదు చేశారు. బూటకపు హామిలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజల తరపున నిలదీస్తే అక్రమంగా కేసులు పెడుతారా అని మండిపడ్డారు. మేము ఫిర్యాదలు చేశాము పోలీసులు ఎందుకు కేసులు నమోదు చేయడం లేదు. కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులపై బుల్డోజర్లు ఎక్కిస్తామని పేర్కొన్న ముఖ్యమంత్రిపై, లగచర్లలో గిరిజనులను ఇబ్బందులకు గురిచేసిన ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డిలపై పోలీసులు ఎందుకు కేసులు పెట్టలేదు. కొడంగల్ నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు ముఖ్యమంత్రి, ఆయన సోదరులే కారణం అని నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంటే ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదు కాలేదన్నారు. మేము కేసులు పెడుతాం నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ ఏకపక్షంగా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతూ అక్రంగా కేసులు పడితే ఎంతమాత్రం భయపడేది లేదని, ఉద్యమ సమయంలో భారసను అణగదొక్కాలని చూసిన మహామహులే కాలగర్భంలో కలిసిపోయిన విషయం గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. వెంటనే మాజీమంత్రి హరీష్‌రావుపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**అబద్దాలతో అధికారంలోకి వచ్చి ...హామీలు మరిచి...**

తెలంగాణ ప్రజానీకానికి బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాది కాలంలోనే రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చిందన్నారు. 420అబద్ధపు హామీలు, ఆరు గ్యారెంటీలను 100రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను మోసం చేసిందన్నారు. రైతురుణమాఫీ. రైతు బంధు, వృద్దాప్య, వికలాంగులు, మహిళల ఫించన్లు, గర్భిణి స్త్రీలకు పోషకాహార కిట్లు, నిరుద్యోగులకు భృతి, 2లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు ఇవ్వడం లేదని మాజీమంత్రి హరీష్‌రావు ప్రశ్నిస్తే..సమాధానం చేప్పే ధైర్యం లేక అక్రమ కేసులు పెడుతున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. గత 10 ఏళ్ళు ఉద్యమ సారథి కెసిఆర్ నాయత్వంలో గణనీయంగా అబివృద్ధిని చూసిన యావత్ తెలంగాణ ప్రజానీకం నేడు చతికిల పడిన ప్రభుత్వాన్ని చూస్తున్నారని, త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళాత్మకదృష్టితో చూస్తే బొమ్మబొమ్మకో కథ : బి.ఎస్.రాములు

**రవీంద్రభారతి, డిసెంబరు 4 ప్రభాతవార్త :** మనం కళాత్మక దృష్టితో చూడాలేకానీ ప్రతీ బొమ్మబొమ్మలోనూ ఒక కథ కనిపిస్తుందని తెలంగాణ బిసి కమిషన్ మాజీ అధ్యక్షుడు, రచయిత బి.ఎస్.రాములు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, పికాసో ద స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారిణి ఉమేశ్వరి దీప బహదూర్, మారిషస్ రవీంద్రభారతి కారిడార్‌లో ఏర్పాటు చేసిన చిత్రకళాప్రదర్శనను రాములు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ గౌరీశంకర్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి.రమణారెడ్డి, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, ప్రొఫెసర్ మహేష్, పికాసో సంస్థ ఫౌండర్ వ్యవస్థాపకుడు బైరు రమేష్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించి కాన్వాయ్ మీద కుంచె పెడితే వేలభావాలను పలికించవచ్చని చిత్రకళాకారిణి అద్భుతంగా నిరూపించారని కొనియాడారు. కళాకారులు రంగురంగుల చిత్రాలతో తమదైన శైలిలో అద్భుతాలు సృష్టించవచ్చునని వేసి చూపించారని చిత్రకారిణి ఉమేశ్వరిని ప్రశంసించారు. ఈ చిత్రకళాప్రదర్శన ఔత్సాహికుల సందర్శనార్థం 7వ తేదీ శనివారం వరకు ఉదయం 11 నుండి రాత్రి 7గంటల వరకు తెరచి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



జ్యోతిప్రకాసనంచేసి చిత్రకళాప్రదర్శనను ప్రారంభిస్తున్న రాములు, గౌరీశంకర్, ఉమేశ్వరి, దైవజ్ఞశర్మ, బైరురమేష్ తదితర అతిథులు

## ఉప్పల్‌లో పుట్టగొడుగుల్లా నకిలీ డాక్టర్లు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో అనుమతి లేకుండా వైద్యం చేస్తున్న ఒక నకిలీ వైద్యుడిని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పట్టుకు న్నారు. తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్స్ కమిటి చైర్మన్ డా. నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉప్పల్ బీరప్పగడ్డలోని అంజలి క్లీనిక్ నిర్వహి స్తున్న నకిలీ వైద్యుడు బానోతు శ్రీనును పట్టుకున్నారు. అతని క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించి అనుమతి లేకుండా పెద్ద ఎత్తున అల్లోపతి మందులు నిల్వ చేసుకున్నట్లు గుర్తించారు. కౌన్సిల్ అధికారులు వెంటనే డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని నకిలీ వైద్యుడిని అదుపులోకి తీసుకున్నారు. మల్కాజిగిరి డ్రగ్ ఇన్స్పెక్టర్లు బి. లక్ష్మినారాయణ, బి.ప్రవీణ్,పి.అంబేద్కర్ తదితరులు శ్రీనగర్ కాలనీలోని క్లినిక్‌లో యాంటిబయాటిక్స్ టాబ్లెట్లు, ఇంజెక్షన్లు కలిగిన 17 రకాల మందులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బానోతు శ్రీను పిఎంపి ఆధీ నం నుంచి స్టెరాయిడ్స్, యాంటి ఫంగల్, పెయిన్ కిల్లర్స్ తదితర మం దులు డ్రగ్ లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీటి విలువ రూ.20వేల వరకు ఉంటుందని, ఎల్‌బినగర్ కోర్టులో కేసు వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాలి

**-ఉమామహేశ్వరి రెడ్డి**



**అత్తాపూర్ డిసెంబరు4,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని జనహిత వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ ,బిజెపి మహిళ నేత ఉమామహేశ్వరి రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్రంలో అన్యాక్రాంతం అవుతున్న దేవాదాయ భూములను రక్షించాలని శ్రీ దుర్గామాత ఆలయ సేవాసమితి రాష్ట్రీయ వానర సేన ఆధ్వర్యంలో దేవాలయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఫ్లప్ కార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ అధీనంలో ఉన్న దేవాలయాల భూముల వివరాలను సేకరించి ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఉమామహేశ్వరి రెడ్డి మాట్లాడుతూ....రాష్ట్రంలో దేవాలయాలకు సంబంధించిన భూములను కొందరూ కబ్జాలు చేస్తున్నారని ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాలన్నారు.రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ రాంబాగ్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి సంబంధించిన 52 ఎకరముల 23 గుంటల భూమి అన్యాక్రాంతం అవుతుందని దినిపైన దేవాదాయ శాఖ మిషనర్ దృష్టి సారించి కాపాడాలని డిమాండ్ చేశారు.లేకుండా ఉద్యమాన్ని మరింత ఉదృత్తం చేస్తామని హెచ్చరించారు.

IN THE COURT OF THE HON'BLE XXVI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS :: AT HYDERABAD
O.S.NO. 270 OF 2012
Between:
G. Laxmi Bai ...Plaintiff
And
Smt. Haseena Begum (Died as per LRs) and others ...Defendants
To
1. Mohd. Mohiuddin, S/o. Not know to the plaintiff, Aged about 75 years, Occ: Business, D-8
2. Mohd. Latif, S/o. Mohd. Mohiuddin, Aged about 53 years, Occ: Business, D-9
3. Irgana Begum, D/o. Mohd. Mohiuddin, Aged about 38 years, Occ: Housewife, D-10
4. Khaiser Taheen, D/o. Mohd. Mohiuddin, Aged about 25 years, Occ: Housewife, D-11
5. Mohd. Raiesuddin, S/o. Mohd. Mohiuddin, aged about 28 years, Occ: Business. D-13
(Defendants 8 to13 are R/o. Door No. 8-3-633/94, Yellareddyguda, Hyderabad.)
6. Sabha, D/o.Late Md. Khasim, aged about 6 years, R/o.Door No.8-3-633/96, Yellareddyguda, Hyderabad-500073.D-17
Please take notice in the above-mentioned suit OS No. 270 of 2012 on the file of Hon'ble XXVI Addl. Chief Judge,City Civil Courts, at Hyderabad filed for declaration, possession and mandatory injunction, the suit stands posted on 11-12-2024 for your appearance i.e., defendants No.8 to 11 and defendant 13 and 17. You may either appear in person or through your Counsel/Advocate in the said Court at 10:30 a.m. In case if you fail to attend on the above-mentioned date, before the above Court the suit will be decided in your absence.
(BY ORDER OF THE COURT)
SRIKANTH HARIHARAN
Advocates
#1-1-336/35, Vivek Nagar, Chikkadpally, Hyderabad -500020
ADVOCATE PLAINTIFF

## వెంకన్న సన్నిధిలో ఘనంగా సుదర్శన హోమం



**మల్కాజిగిరి డిసెంబరు4,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు పురస్కరించుకొని లోక కళ్యాణార్థం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం లో బుధవారం వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం , మూల మూర్తులకు ప్రత్యేక అలంకరణ సంకట విమోచన ఆంజనేయ స్వామి వారికి అలంకరణలు నిర్వహించినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని లోక కళ్యాణం కోసం సుదర్శన హోమం ను ఆలయ ప్రధాన అర్చకులు ముడంబై వేంకట రమణా చార్యులు, అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్లు ఉమేష్ సింగ్ , రామదాసు సంతోష్ ముదిరాజ్ మాజీ ధర్మకర్తలు సానాది శంకర్ ,గణేష్ (కన్న) రవీందర్ ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్, అర్చకులు వేణు గోపాల చార్యులు, భక్తులు వెంకటేష్ యాదవ్, సంపత్ గౌడ్,సనా ది శంకర్,రాజు, తోరణాల సంజయ్ గుప్తా, నాగరాజ్, దినేష్, గాంధీ అపర్ణ, రత్న మాల , రేఖ, సునీత, రాజేశ్వరి,రత్న మాణిక్యం , లలిత, దేవి, శ్రావణి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల పై బైక్ ర్యాలీ : లచ్చిరెడ్డి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. డిసెంబరు4.ప్రభాతవార్త :** బిజెపి ఆదేశాల మేరకు బుధవారం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సౌత్ ఈస్ట్ బేకరీ వద్ద నుంచి వనస్థలిపురం రైతు బజార్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమానికి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి రెడ్డి గారు, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి , ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన వైఫల్యాలు, నెరవేరని హామీలు, మరచిపోయిన వాగ్దానాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కొంతం నవకిషోర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు నూతి శ్రీనివాస్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

: విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి, చిత్రంలో ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి పేర్కొన్నారు. మలక్ పేట ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ నామని, విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధనలను అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, పాఠశాల హెడ్మాస్టర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

### అవార్డుల ఎంపికలో అంధులకు ఇతర వైకల్యం గల అభ్యర్థులకు అన్యాయం: చిందాల శ్రీశైలం

**మలక్ పేట ,డిసెంబరు 4 ప్రభాతవార్త:** ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి అవార్డుల ఎంపికలో అంధులకు, ఇతర వైకల్యం గల అభ్యర్థులకు అన్యాయం జరిగిందని అంధుల అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి చిందాల శ్రీశైలం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన 21 రాష్ట్రస్థాయి అవార్డులలో శారీరక వికలాంగ అభ్యర్థులకు 15 ఆవార్డులు, బదిర అభ్యర్థులకు 3 ఆవార్డులు ఇవ్వడం జరిగిందని ,అందులకు ఇతర 19 రకాల వైకల్యం గల అభ్యర్థులకు ఒక అవార్డును కూడా కేటాయించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం వివక్షత కిందికే వస్తుందని, వికలాంగులందరిని సమానంగా చూడవలసిన ప్రభుత్వం అవార్డుల లో 90 శాతం కేవలం శారీర వికలాంగులకు ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. అంధులకు , ఇతర వైకల్యం గల అభ్యర్థులకు అవార్డులలో చోటు లభించకపోవడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అవార్డుల ఎంపిక కమిటీ రాజకీయ ఒత్తిడులకు తలొగ్గడం జరిగిందని విమర్శించారు. అవార్డులు ఇచ్చిన వారిలో ఒక్క అంధ అభ్యర్థి కూడా లేరని పేర్కొన్నారు. అవార్డుల ఎంపికలో జరిగిన అన్యాయంపై తగిన విచారణ జరిపించి అవార్డుల విలువలను కాపాడని దివ్యంగా సంఘాల నేతలు కోరుతున్నారు.

### మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి స్థానం కల్పించాలి



**తుర్కయంజాల్ డిసెంబరు 4,ప్రభాతవార్త :** మంత్రివర్గ విస్తరణలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి స్థానం కల్పించాలని సామాజిక కార్యకర్త, తెలంగాణ బట్రాజు యోజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కూరపాటి నరసింహారాజు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కూరపాటి నరసింహారాజు, సరికొండ రుషికేశ్వర్ రాజు లు క్యాంప్ కార్యాలయం నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు పాదయాత్రగా బయలుదేరారు.

## కోహెడలో మార్కెట్ ఏర్పాటుపై సిఎం ప్రకటన హర్షణీయం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఛైర్మన్, వైస్‌ఛైర్మన్

**అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** కోహెడలో అత్యున్నత ప్రమాణాలతో అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో బాటసింగారం లోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో పాలకవర్గ సభ్యులు, రైతులు, వర్తకులతో కలిసి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ... కోహెడ రెవెన్యూ పరిధిలో 250 ఎకరాల్లో 2000 కోట్ల రూపాయలతో పండ్లు, కూరగాయలు, డైరీ ఉత్పత్తులతో (సమీకృత మార్కెట్) మార్కెట్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో రైతులు, వర్తకులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారన్నారు. వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు చొరవతో మార్కెట్‌ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వం మార్కెట్ ఏర్పాటు చేస్తామని కాలయాపన చేసిందని, రైతులకు న్యాయం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఇప్పటికే రైతులకు 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టి ఏడాది గడిచిందని, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, కేటీఆర్, హరీష్‌రాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్దపు ప్రచారం చేస్తున్నారని త్వరలోనే బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ భాస్కరచారి, డైరెక్టర్లు బండి మధుసూదన్‌రావు, జైపాల్‌రెడ్డి, అంజయ్య, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, నరసింహ, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సూపర్ సక్కర్‌తో డ్రైనేజీ క్లీనింగ్ పనులు : ఎం.రజితరెడ్డి



సూపర్ సక్కర్ మిషన్‌తో డ్రైనేజీ క్లీనింగ్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో మొదటిసారిగా సూపర్ సక్కర్‌తో డ్రైనేజీ క్లీనింగ్ పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డిలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ డివిజన్‌లో సూపర్ సక్కర్‌తో డ్రైనేజీ క్లీనింగ్ పనులను వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. డ్రైనేజీ సమస్య గురించి గతంలో ఎంపిగా సిఎం రేవంత్‌రెడ్డి కౌన్సిల్ మీటింగ్‌లో లేవనెత్తారని, గ్రేటర్‌లోనే తొలిసారిగా ఉప్పల్‌లో సూపర్ సక్కర్‌తో పనులు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి భారీగా నిధులు కేటాయిస్తున్నారని వారు పేర్కొన్నారు. నూతన టెక్నాలజీతో డ్రైనేజీ క్లీనింగ్ జరుగుతుందని, డ్రైనేజీ మరమ్మతులకు రూ.8 కోట్లు కేటాయించారని తెలిపారు. ఉప్పల్ నల్ల చెరువు నుంచి రాంరెడ్డినగర్ వరకు ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్ట్ సిజిఎం సుజాత, జిఎం వసంత, జిఎం సంతోష్‌కుమార్, డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నేతలు బాకారం లక్ష్మణ్, తుమ్మల దేవిరెడ్డి, తెల్కల మోహన్‌రెడ్డి, లుకాస్, మందమురళీరెడ్డి, రత్నం, పి.నాగిరెడ్డి, నర్సింగ్‌రావు, మధన్ గౌడ్, నవీన్ యాదవ్, సందీప్, అలీమ్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్, సుబ్బారెడ్డి, తుమ్మల రాజేందర్‌రెడ్డి, అనిల్, భాస్కర్, ఖాజా, అన్వర్ పాషా, శ్రీను, అరుణ్, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు:పవన్



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్‌బినగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీశంకర్ కాలనీలో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని గతంలో వేసిన డ్రైనేజీలైన్లు పాడైపోయి మురుగునీరు పొంగిపొర్లుతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే జలమండలి ఏఈ స్రవంతిరెడ్డిని పిలిపించి డ్రైనేజీ సమస్యలను చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ సమస్యలపైన చర్యలు తీసుకోవాలని, నూతన డ్రైనేజ్ లైన్లు ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులను కోరారు. ఏఈ మాతృనాయక్‌తో కలిసి కమ్యూనిటీ హాల్‌ని పరిశీలించి త్వరలో వరమత్తులు చేపడతామన్నారు. విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలు, రోడ్డు సమస్యలను కూడా పరిష్కరించాలని కార్పొరేటర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, రమేష్‌చారి, సంగీత, భాస్కర్, దయాకర్, అఖిల్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**హయత్‌నగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్, పసుమాముల, పెద్దఅంబర్‌పేట గ్రామాల్లోని ఆయా వార్డులలో నిర్వహించనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరవుతారని కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఛైర్‌పర్సన్ జయశ్రీరాజు, పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి కోరారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయలు వెచ్చించి డ్రైనేజీ, తాగునీరు, సీసీరోడ్లు వంటి అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు.కార్యక్రమంలో నాయకులు విజయశేఖర్‌రెడ్డి, పసుల రాజేందర్,శంకరయ్యగౌడ్,రామలింగం, జంగయ్య పాల్గొన్నారు.

### వికలాంగులు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలి : సుజాత



వికలాంగులకు రిక్షాలు వంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ, ఉపకమిషనర్

**ఎల్‌బినగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** వికలాంగులు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని సరూర్ నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత సూచించారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో వికలాంగులకు సైకిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగుల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు మాట్లాడుతూ మనిషిని చూడండి, మనిషిలోని అవిటితనన్ని కాదు. కళకు ఏది అడ్డురాదు ఆత్మస్థైర్యామే అన్నిటికీ మార్గం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారావు దయానంద్‌గుప్తా, కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, చింతల అరుణసురేందర్‌యాదవ్, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, రంగ నరసింహ గుప్త, డిపిఓ బలరాం, మమత,నాయకులు సిద్దల ఐలయ్య, రావుల శ్రీనివాస్‌గౌడ్, అరుణచారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్కేపురం డివిజన్ చిత్రాలు లేఅవుట్‌లోని సీనియర్ సిటిజన్ భవనంలో ఉన్న సమస్యలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి.(ఎల్‌బినగర్, ప్రభాతవార్త)

## పోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన : పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్‌లో పోచమ్మ ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** ఉప్పల్ మల్లికార్జుననగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆలయంలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రంగారెడ్డి, సత్తిరెడ్డి, గోపినాయక్, కొండల్‌రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, దేవిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నగేష్, భానుచందర్, గాలయ్య, నారాయణరెడ్డి, మూర్తి, ఓబుల్‌రెడ్డి, సమ్మయ్య, విమల పాల్గొన్నారు.

## సుల్తాన్‌పూర్, ఎంఎఆర్ టౌన్‌షిప్‌లలో సిసి రోడ్లకు శ్రీకారం



సిసి రోడ్డు పనులను ప్రారంభించి పర్యవేక్షిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13, 14 డివిజన్‌లలో బుధవారం సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు నేనావత్ బాలు నాయక్, జెనిగె భారతమ్మ కొమురయ్యల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సిసి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆమె సుల్తాన్‌పూర్ టౌన్‌షిప్, ఎఎంఆర్ టౌన్‌షిప్‌లలో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, డిఇఇలు జ్యోతిరెడ్డి, నర్సింహరాజు, ఎఇ వినీల్‌గౌడ్, స్థానిక నాయకులు జెనిగె శ్రీనివాస్ యాదవ్, వరికుప్పల యాదయ్య, అన్ను శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ జిఎ 2 కాలనీలోని చిల్డ్రన్స్ పార్క్ ముందు సిసి రోడ్డు నిర్మాణ పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అమ్మద్‌బిన్ బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, కాలనీ అధ్యక్షుడు కృష్ణ మురళి, రాజేశ్వర్‌రావు, రమణమూర్తి, ఎం.ఎస్.చారి, రవి, శ్రీనివాస్, వనజ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

### కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

**సైదాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో బుధవారంనస్వామివారికి మరియు అన్ని ఉపాలయాలలో అలంకారాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ లోక కళ్యాణార్థం శ్రీ గణపతి, మన్యు సూక్త సహిత సుదర్శన హోమంను వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాణాధికారి ఎన్.లావణ్య, వేద పండితులు సిహెచ్ ముత్యాల శర్మ, దైత పవన్ కుమార్, ముఖ్య అర్చకులు అంబయ్య, పీతాంబరాచార్యులు, అర్చకులు కె.సంతోష్ కుమార్, అంబాప్రసాద్, మురళీధర్ శర్మ, సంతోష్ కుమార్ శర్మ, శ్రవణ్ కుమార్ శర్మ, ప్రవీణ్ కుమారాచార్యులు, సిబ్బంది ఎం.వెంకటయ్య, వేణుగోపాల్, సుజాతలు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాం

-పండుగుల ఛైర్‌పర్సన్ జయశ్రీరాజు



సీసీరోడ్డు శంకుస్థాపనలో ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు

**హయత్‌నగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికోసం నిరంతరం కృషిచేస్తున్నామని ఈక్రమంలో దశలవారిగా అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజలకు సమస్యలు లేకుండా చేస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. డివిజన్ పరిధిలోని 7వ వార్డులో 7 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేయనన్న సీసీ రోడ్డు పనులను ఆమె స్థానిక కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ...తమ పదవి కాలం పూర్తయ్యేలోగా అన్నివార్డులలో సమస్యలను గుర్తించి అవసరమైన నిధులను కేటాయించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పసుల రాజేందర్, కో-ఆప్షన్ సభ్యులు ఖలీల్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నేవీ డే



ఎన్‌సీసీ జెండా ఆవిష్కరణలో వైస్‌ప్రిన్సిపల్, ఎన్‌సీసీ క్యాడెట్లు

**హయత్‌నగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** కళాశాలలో విద్యార్థులు పొందే శిక్షణ ద్వారా నౌకాదళంలో ఉద్యోగావకాశాలు, ఉన్నత విద్య అవకాశాలను పొందవచ్చని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నేవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్‌సీసీ క్యాడెట్స్ గార్డ్‌ఆఫ్‌ఆనర్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా అకాడమిక్ కోఆర్డినేటర్ డా.బకరం నరసింహ మాట్లాడుతూ... ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, వారి క్రమశిక్షణ సమాజానికి దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. ప్రాథమిక సైనిక శిక్షణ ద్వారా ధైర్యసహాసాలు, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎ.యాదయ్య మాట్లాడుతూ... 1971లో భారత్-పాక్ యుద్ధంలో కరాచీ నౌకాశ్రయంపై భారత నావికాదళం రాత్రి సమయంలో జరిపిన మెరుపు దాడిని ఆపరేషన్ ట్రైడెంట్‌గా పిలుస్తారని, దీనికి గుర్తుగా ప్రతిఏడాది డిసెంబరు 4న నావికాదినోత్సవాన్ని నిర్వహిస్తారని వివరించారు.

### గుర్రంగూడ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన గుర్రగూడ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

**సరూర్‌నగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని గుర్రంగూడలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు పుట్టగళ్ళ రాము మాదిగ ఆధ్వర్యంలో మండల అధికార ప్రతినిధి వంక ఉపేందర్‌రెడ్డి మాదిగ, మండల కో-ఇంఛార్జి కనగట్ల రవి మాదిగల అధ్యక్షతన నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షునిగా పుట్టగళ్ళ వెంకటేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా పుట్టగళ్ళ దశరథ మాదిగ, పుట్టగళ్ళ రాము మాదిగ, అధికార ప్రతినిధిగా తుమ్మలూరు దశరథ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా పుట్టగళ్ళ కుమార్ మాదిగ, తరుణ్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా పుట్టగళ్ళ ఆకాశ మాదిగ, కార్యదర్శిగా భాను మాదిగ, సహాయ కార్యదర్శిగా చిన్న వెంకటేశ్ మాదిగ, సభ్యులుగా నరసింహ మాదిగ, విజయ్‌మాదిగ, జనార్ధన్ మాదిగ, గణేష్ మాదిగలను ఎన్నుకున్నారు.

## జనార్ధన్‌రెడ్డికి నివాళులర్పించిన హైడ్రా కమిషనర్



కార్యక్రమంలో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ఎల్‌బినగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఆర్‌కెపురం డివిజన్ అల్కాపురి స్వాగత్ హోటల్ కన్వెన్షన్ హాల్లో మహాత్మాగాంధీ లా కళాశాల చైర్మన్ గంగుల గోవర్ధన్‌రెడ్డి తండ్రి గంగుల జనార్ధన్‌రెడ్డి ఏకాదశ దినకర్మలో హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, మల్టీజోన్ ఐజి వి.సత్యనారాయణ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎస్‌పిఎఫ్ డిజిపి అనిల్, యూత్ ఆక్టివిటీస్ డెవలప్మెంట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, యాదాద్రి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, చైర్మన్ హైర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, ఖిల్లా మైసమ్మ చైర్మన్ సురేష్, ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### హిందువుల రక్షణ సంఘీభావ సభకు తరలిన బిజెపి నేతలు



హిందూ ఐక్య వేదిక ధర్నా కార్యక్రమానికి ర్యాలీగా తరలివెళుతున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నగరంలోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఉప్పల్ సర్కిల్ నుంచి పలువురు బిజెపి నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఉప్పల్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, గోనె శ్రీకాంత్ తదితరులు ర్యాలీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందు దేవాలయాపై దాడులు సరికాదని, దీనిని అరికట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిజెపి డివిజన్ కార్యదర్శులు సంకూరి కుమారస్వామి, ఉలుగొండ నారాయణదాసు, వేముల తిరుపతయ్య, శాగ రవీందర్, దయానందరెడ్డి, దర్శనాల సుధాకర్, రాగి లతారెడ్డి, ఎస్.గీత తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణలో టిడిపికి పూర్వ వైభవం ఖాయం : అశోక్‌గౌడ్



టిడిపి సభ్యత్వ నమోదు చేయిస్తున్న టిడిపి పార్లమెంట్ ఇంచార్జీ అశోక్‌కుమార్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** తెలంగాణలో టిడిపికి పూర్వ వైభవం ఖాయమని టిడిపి మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు రామంతాపూర్ చర్చికాలనీలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో టిడిపి మరింత బలోపేతం అవుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని టిడిపి సభ్యత్వ నమోదు కీలక భూమిక పోషించడం జరుగుతుందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని టిడిపి పార్టీ నేతలు, కార్యకర్తలు విధిగా సభ్యత్వం చేయించుకోవాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగు చేయూత అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ అధ్యక్షుడు తిక్క ప్రకాష్, దుర్గ ప్రకాష్, వినోషమ్మ, రాయన్న తదితరులు పాల్గొన్నారు.

### కనుల పండువగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న డాక్టర్ జ్యోతి, వెంకటేశ్ దంపతులు

**సరూర్‌నగర్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఆర్‌సిఐ రోడ్డులోనున్న మీర్‌పేట్ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ ఎస్‌వి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి, నర్సింగ్ స్కూల్ వీధిలో మంగళవారం రాత్రి శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కనుల పండువగా జరిగింది. ఆసుపత్రి యాజమాన్యమైన డాక్టర్ జ్యోతి, డాక్టర్ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో పడి పూజోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. 13వ సారి మాలధారణ చేసిన డాక్టర్ వెంకటేశ్ అయ్యప్ప సేవలో 25వ సారి పడి పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భజనల మధ్య మహా గురుస్వామి పాలుబాయి అశోక్ ఆధ్వర్యంలో డాక్టర్ దంపతులు అయ్యప్ప స్వామికి వివిధ రకాల అభిషేకాలను భక్తిశ్రద్ధలతో జరిపారు.వందలాది అయ్యప్ప స్వాములు హాజరైన ఈపూజలో మహా పడిని వెలిగించి ముగించారు.అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అల్పాహార,భోజన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### జిల్లాస్థాయిలో కారుణ్య సింధు విద్యార్థికి ప్రథమ స్థానం



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఆశ్రమ నిర్వాహకులు

**సైదాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో భగవత్‌గీతపై జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలో ఐఎస్ సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు ఆశ్రమం విద్యార్థి దీపక్ మొదటి స్థానంలో నిలిచారు.